క్లుప్తంగా

రేపు హోళి

నారాయణపేట రూరల్: హిందువుల పవిత్ర పండగ హోళిని జిల్లా వ్యాప్తంగా చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాంబాబు, కన్న శివకుమార్ కోరారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ పండగ నిర్వహణలో ఎలాంటి తిరకాసు లేకుండా అందరూ కలిసి 13న కామదహనం, 14న హోళి పండుగ చేసుకోవాలని కోరారు. 14న ఉదయం 9 గంటలకు చౌక్ బజార్‌లో భారతమాత పూజ ఉంటుందని హిందువులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మురళి బట్టడ్, కడదాసు ప్రవీణ్, సభ్యులు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్

మద్దూరు: మున్సిపాలిటీ కమిషనర్‌గా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. కోస్గి మున్సిపల్ కమిషన్ నాగరాజు మద్దూరు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. నూతన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీని అన్ని విధాలు అభివృద్ధి చేయడానికి ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు కమిషనర్‌ను సన్మానించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని డీఈకి వినతి

కృష్ణా: మండలంలోని ఆలంపల్లి గ్రామానికి ప్రస్తుతం ఉన్న 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులుగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు బుధవారం విద్యుత్‌శాఖ డీఈకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొంతకాలంగా లో ఓల్టేజీతో పాటు రోజులో చాలాసార్లు ఫీజులు పోతున్నాయన్నారు. గ్రామానికి విద్యుత్‌ను అందించే ట్రాన్స్‌ఫార్మర్‌కు పక్కన వ్యవసాయ మోటార్ల కలెక్షన్లు కూడా ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

గ్రూప్‌-2లో పురవార్డు అధికారికి ఉద్యోగం

నారాయణపేట టౌన్: పట్టణ పురపాలికలో వార్డు అధికారిగా విధులను నిర్వహిస్తున్న మన్నె వేణు గ్రూప్‌-2 ఫలితాల్లో 31వ ర్యాంక్ సాధించి ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పుర కమిషనర్ భోగేశ్వరులు మన్నె వేణును శాలువాతో సన్మానించి, అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. పుర సిబ్బంది పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ లెక్చరర్‌గా మహమ్మద్ వాహిద్

మద్దూరు: మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామానికి చెందిన డాక్టర్ మహమ్మద్ వాహిద్ బుధవారం రవీంద్రభారతిలో జూనియర్ లెక్చరర్‌గా నియమాక పత్రం అందుకున్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన జూనియర్ లెక్చరర్స్ పరీక్షలో మల్టీజోన్‌-2 నుంచి రసాయనశాస్త్రం సబ్జెక్టు లెక్చరర్‌గా మహబూబ్‌నగర్ జిల్లా ఎన్మన్‌గండ్ల కళాశాలకు పోస్టింగ్ వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాగనూర్: మండలంలోని ఓబ్లాపూర్ గేట్ దగ్గర ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. మండలంలోని అడవి సత్యారం గ్రామానికి చెందిన రామాంజనేయులు, నర్సింహులు గ్రామం నుంచి మండల కేంద్రానికి గ్యాస్ కోసం వచ్చారు. అయితే తిరుగు ప్రయాణంలో ఓబ్లాపూర్ గేట్ సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం నడుపుతున్న రామంజనేయులుకు ఫిట్స్ రావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టాడు. కిందపడి కొట్టుమిట్టాడుతుండగా అక్కడున్న వారు గమనించి చేతులో తాళంచెవి పెట్టి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారిని 108లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రాణాప్రాయం లేదని వైద్యులు తెలిపారు.

బస్సు సర్వీస్ గ్రామంలోకి నడిపించండి

నారాయణపేట రూరల్: మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన 70 మంది విద్యార్థులు నారాయణపేటలో చదువుకునేందుకు నిత్యం వెళ్తుంటారని, బస్సు గ్రామంలోకి రాకపోవడంతో రెండు కిలోమీటర్లు నడవాల్సివస్తోందని పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు. బస్సు సర్వీస్‌ను గ్రామంలోకి నడిపించాలని బుధవారం ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గౌస్, వెంకటేష్, నవిత, రాజేష్, రమేష్, అనూష, నందిని, కీర్తన పాల్గొన్నారు.



సుద్దబండ తండాలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ



మొగుల్‌మడ్కలో ఎండిన వరి పంటలో మేకలను వదిలిన రైతులు

తగ్గిన నీరు.. ఎండిన పైరు

- క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు
- నీటిని పొదుపుగా వాడాలని సూచన

దామరగిద్ద: భూ గర్భజలాలు అడుగంటుతుండటంతో బోర్లలో నీరుతగ్గి పంటలకు అందించలేని పరిస్థితి ఏర్పడుతుందని వ్యవసాయ మండల అధికారి మణిచందర్ అన్నారు. బుధవారం మండలంలోని సుద్దబండతండాలో ఏఈఓలతో పాటు క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించారు. పంటలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే నీటిని అందించాలన్నారు. తండాలో 4 ఎకరాల మేర వరి పంట ఎండినట్లు గుర్తించామన్నారు. ప్రధానంగా కలుపుతీసే దశ, పూత దశ, పాలుపట్టే దశ, గింజ ఏర్పడే దశలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో ఎండలు పెరిగి నీటి మట్టం తగ్గే అవకాశం ఉన్నందున నీటి పొదుపుతో పాటు తడులు ఇవ్వడంలో తగు జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రవి, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కరస్వామి

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ భాస్కరస్వామి అన్నారు. బుధవారం గుండుమాల్ మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనశాలలో బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతిరోజు తాజా కూరగాయలతో ఆహారం వడ్డించాలన్నారు. విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకట్రాములు, ప్రధానోపాధ్యాయుడు బిచ్చయ్యగౌడ్, సీఆర్‌పీ దస్తయ్య, తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి చాణిక్యా రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి నీటి కుళాయిలు, వాటర్ ట్యాంకుల స్థితిగతులను పరిశీలించారు. ఎవరికి తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామని సూచించారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, వృథా చేయరాదని కోరారు. పంచాయతీ సిబ్బంది సైతం చురుకుగా పనిచేయాలని సూచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మక్తల్‌లో బీసీ గురుకుల పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న కవిత

నారాయణపేట/మక్తల్: సాయివిజయ నగర్ కాలనీలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులకు బుధవారం మహిళలపై జరుగుతున్న నేరాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మహిళలపై వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్, సోషల్ మీడియా ద్వారా సెల్‌ఫోన్‌లో బ్యాడ్ కామెంట్స్, రాంగ్ కాల్స్, రాంగ్ మేసేజ్‌లపై విద్యార్థులకు షీ టీమ్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం పోలీసులు బాలరాజు మాట్లాడుతూ.. పరీక్షలు పూర్తయిన తర్వాత కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ కావాలని, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, రీడింగ్ బుక్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. మహిళలకు, విద్యార్థులకు షీ టీమ్ పోలీసులు అండగా ఉంటారన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, వేధింపులకు గురైన షీ టీమ్ పోలీసులను నేరుగా సంప్రదించవచ్చన్నారు.

- మక్తల్ పట్టణంలో బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో ఉమెన్స్ అండ్ చైల్డ్ వేల్ఫేర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సెల్ అధికారి కవిత మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో బాలరక్షక్ భవన్ ఉందన్నారు. బాలలకు రక్షణ, సంరక్షణ కల్పిస్తామన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాలపై వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్య, లీగల్, చైల్డ్ మ్యారేజ్, లేబర్ యాక్ట్‌లపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బోయలను ఎస్టీలో చేర్చాలి

నారాయణపేట రూరల్: బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మండల బోయ సంఘం నాయకులు, జలాల్‌పూర్ మాజీ సర్పంచ్ శివప్ప కోరారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన బోయ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయలను అన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కులగణన గొప్పగా చేశామని చెబుతున్నా కులాల ప్రాతిపదికన బోయలను ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బోయ సంఘం నాయకులు భీంశప్ప, చిన్న బైరప్ప, నరసప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ దేవత బండారు ఉత్సవం

నర్వ: మండలంలోని ఉందేకోడ్ గ్రామంలో గౌడ కులస్తులు ఎల్లమ్మ బండారు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు గౌడ కులస్తులు బండారు(పసుపు) చల్లే కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి మేకలు, గొర్రెలను బలిచ్చి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నారాయణపేట: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజు సూచించారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని వీర సావర్కర్ చౌరస్తా రహదారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఇమాన్యు, మోహన్ లాల్, వాహనదారులు పాల్గొన్నారు.

గోర్‌సేన అధ్యక్షుడిగా సంతోష్ నాయక్



నారాయణపేట రూరల్: గిరిజన సంఘంలోని భాగమైన గోర్ సేన విభాగానికి నారాయణపేట జిల్లా అధ్యక్షులుగా సంతోష్ నాయక్ ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో వివిధ జిల్లాల బాధ్యులను నియమించారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా ఊటకుంట తండాకు చెందిన సంతోష్ నాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గోర్ సేన అభివృద్ధికి కృషి చేస్తామని, మండలాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎయిడ్స్‌ను సమష్టిగా నిర్మూలించాలి



సింగారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నారాయణపేట రూరల్: ఎయిడ్స్‌ను సమష్టిగా నిర్మూలించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిరాం అన్నారు. మండలంలోని సింగారంలో బుధవారం సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 100 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరికి అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మంజూర్ అహ్మద్, సుధాకర్ బాబు, మెనేజర్ కార్తీక్ కుమార్, ఏఎన్‌ఎం తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు తారమ్మ, భాగ్యమ్మ, అనురాధ, మాజీ సర్పంచ్ సిద్రమప్ప, శ్రీకాంత్ రెడ్డి కృష్ణ, చంద్రశేఖర్, అశోక్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఈద్గా చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు మహిమూద్ ఖురేసీ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే నిధులతో ప్రహరీ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, రామకృష్ణ, సత్యన్న, రామకృష్ణారెడ్డి, రాము, గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కొత్తపల్లి భజన భక్తులు

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన భజన మండలి భక్తులు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానంలోని అఖండ భజన సంకీర్తనల్లో పాల్గొని ఆలపించారు. ఈ సంకీర్తనలు ఆలపించడానికి సంవత్సరంలో రెండుసార్లు టీటీడీ బోర్డు నుంచి అవకాశం రావడంతో కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన 16 మంది భక్తులు తిరుమల తిరుపతి పుణ్య క్షేత్రానికి వెళ్లి అఖండ భజనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నీలారెడ్డి, వెంకప్పగౌడ్, రాంచంద్రయ్య, ఇంజమూర్ నారాయణ రెడ్డి, చెన్నయ్య, జనార్దన్‌చారి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో..

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె. గాయత్రి ఇటీవల నల్గొండ జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలో ద్వితీయ బహుమతి మరియు మౌంటెన్ సైక్లింగ్ 20కి.మీ పోటీలో నాలుగో బహుమతి పొంది జాతీయ స్థాయిలో నారాయణపేట జిల్లా మంచి పేరుతెచ్చింది. బుధవారం కళాశాల తరుపు న గాయత్రిని ప్రిన్సిపల్, యాజమాన్యం, అధ్యాపక బృందం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు జిల్లా క్రీడా అధ్యక్షుడు గోపాల్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథుడి ప్రతిష్ఠాపన



పెద్దకడ్మూర్‌లో ప్రతిష్ఠించిన తిరుమల నాథుడి విగ్రహం

నర్వ: పెద్దకడ్మూర్‌లోని నల్లచెరువుపై వెలిసిన తిరుమల నాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్, నూతన విగ్రహ ప్రతిష్ఠాపనలతో పాటు శ్రీనివాస, పద్మావతిల కల్యాణ మహోత్సవం రుత్వికులు శ్యామ్‌సుందర్‌జోషి, రాఘవేందర్‌జోషీలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని 108 కలువ పుష్పాలతో పూజ నిర్వహించి అలంకరించారు. గోవిందనామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, హైదరాబాద్ ఆర్డీఓ చంద్రకళ, ఎంపీడీఓ శ్రీనువాసులు, కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నయ్యసాగర్, ఆయా పార్టీల నాయకులు,, దాతలు గొని దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మన్న, పెద్దలు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



మాగనూర్‌లో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ జాన్‌సుధాకర్

మాగనూర్: కొన్ని రోజులుగా మండలంలో వరి పంటల మార్పులపై జైపాల్‌రెడ్డి, వర్క్యూర్ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్ అనే రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు కొన్న విత్తనాలు వల్లనే ఈ పంట నష్టానికి కారణమని తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో డీలర్‌పై ఫిర్యాదు చేశారు. ఆయా దినపత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మండలంలోని వడ్వాట్ గ్రామంతో పాటు మాగనూర్ గ్రామంలోని ఆయా రైతుల పొలాలను బుధవారం సందర్శించారు. పంటల మార్పులకు గల కారణాలను తెలియజేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఏవైనా తప్పిదాలుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పంటలో మార్పుపై సంబంధిత వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన రాలేదని, ఏడీఏ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏడీఏ నాగేష్ కుమార్‌రెడ్డి, ఏఓ పోలప్ప, ఏఈఓ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మద్దూరు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న నాయికులు, అధికారులు

మద్దూరు: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో బేటీ బాచావో.. బేటీ పడావో పథకంలో భాగంగా ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసినా వారికి మంచి ఉపాధి అవకాశాలు వచ్చేలా శిక్షణ ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ నర్సింహులు, మాజీ సర్పంచ్ అరుణ, కాంగ్రెస్ నాయకులు బాబుస్వామి, కేంద్రం నిర్వాహకుడు కంరొద్దీన్, అనిత, నర్సింహ పాల్గొన్నారు.

ఆరోగ్యకర హోలీ చేసుకుందాం



మీర్జాపూర్‌లో సహజ రంగులు తయారు చేస్తున్న విద్యార్థులు

కోస్గి: ఆనందాన్ని పంచే హోలీ పండుగను ఆరోగ్యకరమైన రంగులతో జరుపుకుందామని ఎంగ్‌ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త వార్ల మల్లేశం సూచించారు. విద్యాశాఖ, హరిత విప్లవ మండలి సంయుక్తంగా అమలు చేస్తున్న యువ పుడమి నాయకుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'హోలీ పండుగలో సహజ రంగుల ఆవశ్యకత' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హరిత దళ సమన్వయకర్త మల్లేశం మార్కెట్‌లో లభించే రసాయన రంగుల వల్ల కలిగే ప్రమాదాన్ని వివరిస్తూ విద్యార్థులతో వివిధ రకాల పూలు, కూరగాయలతో ఎలాంటి హాని చేయని సహజ సిద్ధమైన రంగులను తయారు చేయించారు. మార్కెట్‌లో లభించే కృత్రిమ రసాయనిక రంగుల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలను వివరించారు. అనంతరం ఆరోగ్యకరమైన హోలీని చేసుకుందామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తకు న్యాయం చేయాలి



నారాయణపేటలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

నారాయణపేట టౌన్/ నారాయణపేట రూరల్: జగిత్యాల జిల్లాలో లైంగిక దాడికి గురైన ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలని జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకురాలు బాలమణి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆరోగ్యకేంద్రం వద్ద ఆశా వర్కర్స్‌తో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన నిదితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

- వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని ఆ యూనియన్ నాయకురాలు రాధిక డిమాండ్ చేశారు. కోటకొండ సబ్ సెంటర్ ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి అన్ని రకాలుగా ఆదుకోవాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కృష్ణవేణి, నర్సమ్మ, మంజుల, వెంకటేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.

గీతకార్మికులకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న గీత కార్మిక సంఘం నాయకులు మహేష్‌గౌడ్

ఊట్కూరు: నేటి నుంచి జరుగుతున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో గీత కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని తెలంగాణ గీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మహేష్‌గౌడ్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయదలిచిన కాటమయ్య రక్షణ కవచం వెంటనే కార్మికులకు అందించి వారిని ప్రమాదాల నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ కవచం స్కీం ప్రారంభించి 9 నెలలు గడిచినా, ఈ పథకం పూర్తిగా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 9 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 360 మంది ప్రమాదాలకు గురికాగా, 43 మంది మృతి చెందారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో గీతా కార్మికులపై ప్రత్యేక చర్చలు జరిపి వివిధ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు సురేందర్‌గౌడ్, రవిగౌడ్, వెంకటప్పగౌడ్, నారాయణగౌడ్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

ఎంపీకి వాల్మీకి బోయల కృతజ్ఞతలు

నర్వ: వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంపీ డీకే అరుణ పార్లమెంటులో ప్రస్తావించడం ఎంతో అభినందనీయమని వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకులు నీరజ్ అన్నారు. బుధవారం నర్వ వాల్మీకి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు కావలి అయ్యన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు సమష్టిగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్టీ జాబితాలో చేర్చేలా బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా ఎంపీ కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు నీరజ్, గడ్డం నర్సింహులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కావలి అయ్యన్న, ముమ్మలి రాములు, నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకులకు బీజేపీ అండ

వాల్మీకి బోయలకు బీజేపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. నర్వలోని తన ఫామ్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. సమావేశంలో డా.వెంకటేశ్వర్‌రావు, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటన్న, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.